ప్రమాదాలను నివారించేలా..

- అండర్ పాస్‌ల ఏర్పాటుకు చర్యలు
- జాజిరెడ్డిగూడెం శివారులో రెండుచోట్ల నిర్మించాలని అధికారుల నిర్ణయం
- రూ.3 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం

అర్వపల్లి: సిరోంచ–రేణిగుంట (365 నంబర్) జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేపట్టిన నకిరేకల్–తానంచర్ల రోడ్డుపై ప్రమాదాల నివారణకు అధికారులు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా సూర్యాపేట జిల్లా పరిధిలోని జాజిరెడ్డిగూడెంలో తరచూ జరుగుతున్న ప్రమాదాలకు చెక్ పెట్టాలని మండల ప్రజల విన్నపాల మేరకు చర్యలకు ఉపక్రమించారు. గతంలోనే ఎన్‌హెచ్ విభాగం 365 హైవేపై గుర్తించిన బ్లాక్‌స్పాట్లలో అండర్‌పాస్‌లు నిర్మించాలని నిర్ణయించారు.

రెండుచోట్ల నిర్మాణానికి మోక్షం

365హైవే నకిరేకల్ నుంచి తానంచర్ల వరకు 66కి.మీ. ఉంటుంది. అయితే ఈ రోడ్డు విస్తరణను రూ.298కోట్లతో 2017లో పనులు ప్రారంభించి 2021లో పూర్తి చేశారు. కాగా 66కి.మీ రోడ్డుపై హైవే నుంచి జాజిరెడ్డిగూడెంనకు వెళ్లే దారిలో, మూసీ వంతెన వద్ద జాజిరెడ్డిగూడెం నుంచి కొత్తగూడెం వెళ్లే ప్రదేశాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. ఇటీవల ఎన్‌హెచ్ విభాగం సూర్యాపేట డీఈఈ బాలునాయక్ పరిశీలించి వెళ్లారు. ఈ రెండు చోట్ల ప్రమాదాల నివారణకు సుమారు రూ.3కోట్లతో అండర్‌పాస్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశారు. వారం రోజుల్లో ఈ ఎస్టిమేషన్ కేంద్ర ప్రభుత్వానికి వెళ్లనుంది. ఈ అండర్‌పాస్‌ల నిర్మాణం జరిగితే మండలంలో పెద్దదైన జాజిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ ప్రజలతోపాటు ఈ హైవేపై వెళ్లే ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు తీరనున్నాయి.



365 హైవే నుంచి జాజిరెడ్డిగూడెం వెళ్లే వైపు ప్రమాదకరంగా ఉన్న రోడ్డు



కొత్తగూడెం వెళ్లేదారిలో అండర్‌పాస్ నిర్మించే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎన్‌హెచ్ డీఈఈ (ఫైల్)

కొన్నేళ్లుగా పోరాడుతున్నాం



“జాజిరెడ్డిగూడేనికి వెళ్లే దారితోపాటు, జాజిరెడ్డిగూడెం నుంచి కొత్తగూడెం వెళ్లే దారి వద్ద రెండు చోట్ల అండర్‌పాస్‌ల నిర్మాణానికి కొన్నేళ్లుగా పోరాడుతున్నాం. ఈ విషయమై మంత్రి కోమటిరెడ్డికి విన్నవించాం. ఎట్టకేలకు హైవే అధికారులు ఇటీవల అండర్‌పాస్‌లు నిర్మించే ప్రదేశాలను పరిశీలించి వెళ్లారు.

– నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, జాజిరెడ్డిగూడెం

వారం రోజుల్లో కేంద్రానికి నివేదిస్తాం



“జాజిరెడ్డిగూడెం ప్రాంతంలో 365 హైవేపై రెండు చోట్ల అండర్‌పాస్‌ల నిర్మాణానికి ఇప్పటికే ఎస్టిమేషన్ నివేదిక తయారు చేశాం. సదరు నివేదికన వారం రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తాం. అనుమతి వచ్చి నిధులు మంజూరు కాగానే వెంటనే పనులు ప్రారంభింపజేస్తాం.

– ధరావత్ బాలునాయక్, ఎన్‌హెచ్ విభాగం డీఈఈ

ఉద్యోగులకు బదిలీ సహజం

దురాజ్‌పల్లి : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజమని కలెక్టర్ ఎస్. వెంకట్రావు అన్నారు. జిల్లా ఉద్యానవనశాఖ అధికారిగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై ఆదిలాబాద్ వెళ్లిన శ్రీధర్‌గౌడ్‌కు గురువారం సూర్యాపేటలోని కలెక్టరేట్‌లో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ఉద్యానవన సాగును పెంచడంలో శ్రీధర్ పాత్ర గొప్పదని అన్నారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ రైతులకు అవగాహన కల్పించి సాగు వైపు మళ్లించారని తెలిపారు. భవిష్యత్‌లో కూడా విజయవంతంగా విధులు నిర్వహించి పనిచేసిన చోట మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీధర్‌గౌడ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, డీపీఓ రామారావు నాయక్, డీఈఓ అశోక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శిరీష, ఎస్సీ అభివృద్ధి అధికారి దయానంద రాణి, డీసీఓ శ్రీధర్, డీటీడీఓ శంకర్ పాల్గొన్నారు.



శ్రీధర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, తదితరులు

నిరుపేదలను ఆదుకునేందుకు ట్రస్టు సేవలు



మెట్టెలు అందిస్తున్న ట్రస్టు సభ్యులు, దాతలు

భానుపురి : భావితరాలకు సనాతన ధర్మం తెలపడంతో పాటు ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవడమే లక్ష్యంగా సదాచార్ ట్రస్టు సేవలందిస్తుందని ట్రస్టు కన్వీనర్ ఈగా దయాకర్‌గుప్త తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన సూర్యాపేటకు చెందిన దాచేపల్లి రఘు కుమార్, కవితల పుత్రిక గాయత్రి వివాహ నిమిత్తం ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం మంగళసూత్రం, మెట్టెలు, నూతన వస్త్రాలు అందించారు. సూర్యాపేటకు చెందిన ఈగ రామయ్య, సోమలక్ష్మి, ఈగ సతీష్, అనూష సహకారంతో పట్టణంలోని విద్యానగర్‌లో గల సదాచార్ ట్రస్ట్ సేవ మందిర్‌లో పుస్తె, మెట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దాతల సహకారంతో ఇప్పటివరకు సూర్యాపేట జిల్లాలో 52 మంది వధువులకు సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన హిందూమతంలోని కుటుంబాలకు చెందిన వారు వివాహం చేసుకొనే వధువు పెళ్లి పత్రిక, ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డుతో ముందుగా సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సదాచార్ ట్రస్టు సభ్యులు మిర్యాల శివకుమార్, ఈగ విజయలక్ష్మి, మిర్యాల కవిత, మొలుగురి పద్మ, బచ్చు పురుషోత్తం పాల్గొన్నారు.

11న ఘంటసాల స్వరాభిషేకం

భానుపురి : ఘంటసాల 52వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 11న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీ బాంకెట్ హాల్‌లో సాయంత్రం 6 గంటలకు ఘంటసాల స్వరాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీజ్ఞాన సరస్వతి సాంస్కృతిక కళావేదిక సభ్యులు తెలిపారు. గురువారం వారు అడిషనల్ ఎస్పీ ఎం.నాగేశ్వర్‌రావుకు ఆహ్వానపత్రికను అందించి మాట్లాడారు. అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు తన స్వరంతో ఎన్నో పాటలు పాడి ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీజ్ఞాన సరస్వతి సాంస్కృతిక కళావేదిక అధ్యక్షుడు జూనియర్ ఘంటసాల బుర్రి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు నక్క శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గుండా రమేష్, కార్య నిర్వాహక సహాయకుడు గోపారపు రాజు, బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



అడిషనల్ ఎస్పీ నాగేశ్వర్‌రావుకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న కళావేదిక సభ్యులు

16న రథసప్తమి వేడుకలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రం రథసప్తమి వేడుకలకు ముస్తాబవుతోంది. ఈ నెల 16న రథసప్తమి వేడుకలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలిరానున్నారు. ఉదయం సూర్య కిరణాలు సూర్యనారాయణస్వామి మూలవిరాట్‌ను తాకనున్నాయి. రథసప్తమి సందర్భంగా ఉదయం 4 గంటలకు స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకం, అలంకరణ జరుగనున్నాయి. ఆ తర్వాత 5.30 గంటల నుంచి స్వామి దర్శనం మొదలవుతుంది. అనంతరం భక్త బృందాలచే భజనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ఉషాపద్మిని ఛాయాసమేత సూర్యనారాయణస్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందని క్షేత్ర వ్యవస్థాపకుడు, సార ఆరాధకులు జనార్దన్‌స్వామి తెలిపారు. సూర్యక్షేత్రంలో రథసప్తమి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానునండటంతో ఏర్పాట్లను ముమ్మరం చేశారు.

ఉండ్రుగొండలో వైభవంగా రుద్రాభిషేకం



ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు

చివ్వెంల : చివ్వెంల మండల పరిధిలోని ఉండ్రుగొండ శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం ప్రాంగణంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో పుష్య మాస శివరాత్రి సందర్భంగా గురువారం రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుడు మంత్రమూర్తి మనోహర శర్మ మంత్రోచ్చరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం క్రిష్ణకుమార్, బందకవి క్రిష్ణ మోహన్, మిట్టకోల మధుసూదన్‌రావు, శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూత



అర్వపల్లి : తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు కంప్యూటర్, ప్రింటర్ బహూకరిస్తున్న దాతలు

సూర్యాపేటటౌన్ : భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్ జయంతి సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లు, నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది ఎండీ.కాలేద్ అహ్మద్ మాట్లాడారు. జాకీర్ హుస్సేన్ ఒక గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హుస్సేన్, కోట గోపి, ప్రిన్సిపల్ సుంకరి అనిత, జహంగీర్, ఏడిండ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్ అభివృద్ధికి దాతలు సహకరించాలని ఆ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి రత్నం లక్ష్మాజీ కోరారు. గ్రామానికి చెందిన దాతలు ఎమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కర్కాని వీరయ్య, దొనకొండ యాదగిరి గురువారం పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్లను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాల అభివృద్ధి కోసం పలువురు దాతలు విరాళాలు ప్రకటించారని, వాటన్నిటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేయాలన్నారు. పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తెస్తే పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వర్దెల్లి కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ సర్పంచ్ పాలెల్లి సురేష్, దాతలు ఎమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కర్కాని వీరయ్య, స్థానికులు వేములకొండ ఉప్పలయ్య, నిమ్మల యల్లయ్య, బొడ్డు వెంకటనర్సు, జీడి రవి, జీడి సైదులు, బొడ్డు రమేష్, కర్కాని శ్రీను, జ్యోతుల వెంకన్న పాల్గొన్నారు.

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్ అన్నా రు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు చల్లా తేజ సహకారంతో పదో తరగతి విద్యార్థులకు అందించిన స్టడీ మెటీరియల్‌ను గురువారం మండల పరిధిలోని ఎర్రపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాల అభివృద్ధి కోసం దాతలు అందించే ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రావుల హన్మంతు, మిర్యాల ప్రసాద్, అయోధ్య, సమత, లింగాల రామచంద్రు, ఎర్రోజు కృష్ణయ్య, అనంతుల నాగలింగం తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట టౌన్ : కస్తూరిబా పాఠశాలలో నోట్ పుస్తకాలు అందజేస్తున్న సొసైటీ సభ్యులు



నూతనకల్ : విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి



తుంగతుర్తిలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య

తుంగతుర్తి : బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలకు, ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మోదీ సర్కార్ 10ఏళ్ల పాలనలో ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించకుండా దేశాన్ని అప్పులపాలు చేసిందన్నారు. ప్రపంచంలోని 125 దేశాల్లో భారత్ ఆకలిలో 11వ స్థానంలో ఉందని తెలిపారు. అయినా ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా, రామమందిర నిర్మాణం పేరుతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజారాం, కండె లింగయ్య, కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, దేశోజు మధు, బొంకూరి శ్యాంసుందర్, తడకమల్ల సంజీవ, బండి రవి, భరత్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

నాగారం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఐక్య కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడంతో అనేకమంది ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్మిక చట్టాలను ఎత్తివేసి వాటి స్థానంలో నాలుగు కోడులను తీసుకురావడంతో కార్మికులకు తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు. నిత్యం పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలను పెంచడం వల్ల సామాన్య, పేద ప్రజలపై పెనుభారం పడుతోందన్నారు. ఆయనతో పాటు సీపీఎం నాయకులు మారయ్య, రాములు, మహేందర్, యాదమ్మ తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు తగవు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తుంగతుర్తి : బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని మాజీ మంత్రిరాంరెడ్డి దామోదర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత 10ఏళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని లూటీ చేసి, అప్పుల తెలంగాణగా మార్చిందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఓటమిని జీర్ణించుకోలేక కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని, సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి మాజీ మంత్రి జగదీష్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌లకు లేదన్నారు. వారు చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తిరుమలప్రగడ కిషన్‌రావు, ఓరుగంటి సత్యనారాయణ, కొండ రాజు, ఉప్పుల రాంబాబు, రామడుగు నవీన్, కుంచాల ప్రవీణ్‌రెడ్డి, ఎండీ అబ్దుల్, నరేష్, భాస్కర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య

నూతనకల్ : వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి కేంద్రం సమగ్ర చట్టం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. నాగయ్య కోరారు. గురువారం నూతనకల్ మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి అన్నం పెడుతూ సంపదను సృష్టిస్తున్న వ్యవసాయ కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో మిగులు భూమి ఉన్నప్పటికీ పేదప్రజలకు పంచడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కూలీ బంధు పథకాన్ని ప్రవేశపెట్టి భూమిలేని పేదలకు రూ. 10లక్షలు అందించాలన్నారు.ఈ నెల 16న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, కొలిశెట్టి యాదగిరిరావు, పులుసు సత్యం, కందాల శంకర్‌రెడ్డి, బుర్ర శ్రీనివాస్, కడెం లింగయ్య, ఆరె రామకృష్ణారెడ్డి, కడెం కుమార్, అండెపల్లి లక్ష్మయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు తమ్మినేనికి పరామర్శ

మునగాల : ఇటీవల గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొంది తెల్దార్‌పల్లిలో తన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను గురువారం మునగాల మండలానికి చెందిన పలువురు పార్టీ నాయకులు పరామర్శించారు. త్వరగా కోలుకొని తిరిగి ప్రజాతంత్ర ఉద్యమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.ముత్యాలు, కౌలుదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ సైదా, ఉసిరికాయల శ్రీనివాస్, నాయకులు, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

సూర్యాపేట రూరల్ : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని రామచంద్రాపురం, రత్నపురం, రామారం, రాజానాయక్ తండా గ్రామ పంచాయతీల్లో వీధులను శుభ్రం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలి

మద్దిరాల : గ్రామ ప్రజలు తమ ఇళ్ల ఆవరణల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలో పలు వీధులను, డ్రెయినేజీలను వైద్య సిబ్బందితో కలిసి పరిశీలించారు. గ్రామాల్లో దోమల తీవ్రత పెరుగుతోందని, దీంతో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్వపల్లి : ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా ఉండాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ అన్నారు. గురువారం జాజిరెడ్డిగూడెంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సందీప్‌కుమార్, డాక్టర్ నగేష్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్, మాగి నాగయ్య, సిబ్బంది వీరయ్య, భీముడు, సతీష్, రామ్మూర్తి, సోమనర్సమ్మ, శ్రీరాములు, వెంకటమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ మన్నె రేణుక

కోడ్ ముగిసినా.. ముసుగు వీడలే



బోరింగ్‌తండా వద్ద బస్టాండ్‌కు వేసిన ముసుగు

ఆత్మకూర్ (ఎస్) : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ కారణంగా ఆయా పార్టీల జెండాలు, గుర్తులు, రంగులు ఉన్న వాటికి అధికారులు ముసుగులు తొడిగారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కోడ్ ఉన్నన్ని రోజులు ఇలాగే ఉంచాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికలు ముగిసి రెండు నెలలు కావస్తోంది. కోడ్ ముగిసినా.. బోరింగ్ తండాలోని బస్టాండ్‌కు వేసిన ముసుగును తొలగించలేదు. ఈ బస్టాండ్‌కు బీఆర్‌ఎస్‌కు చెందిన రంగు ఉందన్న కారణంగా అధికారులు ఎన్నికల సమయంలో ముసుగువేశారు. ఇప్పటికైనా ఈ ముసుగు తొలగించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మృతుడికి నివాళి

మద్దిరాల : మద్దిరాల మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొండగడుపుల ఉపేందర్ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. దీంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు, లాయర్ యుగేందర్ గురువారం ఉపేందర్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిపాల వెంకన్న, నాయకులు మామిడి వెంకటయ్య, రామచంద్రు, వర్మ, హమీద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖాన పరిశీలన

అర్వపల్లి : వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ అన్నారు. గురువారం జాజిరెడ్డిగూడెంలోని పల్లె దవాఖానను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి డాక్టర్, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యాధికారి డాక్టర్ నగేష్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్, ఏఎన్‌ఎంలు సైదమ్మ, శకుంతల, ఆశాకార్యకర్తలు నాగమ్మ, వసంత తదితరులు పాల్గొన్నారు.



పల్లె దవాఖానను పరిశీలిస్తున్న ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, అధికారులు

క్లుప్తంగా

జిల్లా పోర్ట్‌పోలియో జడ్జికి సన్మానం



సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

చివ్వెంల : సూర్యాపేట జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి జస్టిస్ పుల్లా కార్తీక్‌ను గురువారం హైకోర్టులో సూర్యాపేట బార్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం కోర్టులోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలెబోయిన నర్సయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు కంచర్ల సతీష్ కుమార్, కోశాధికారి రాచకొండ యాదగిరి, జె.శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

11న కరాటే శిక్షణ

సూర్యాపేటటౌన్ : అక్షర ఫౌండేషన్, సూర్యాపేట షీటీం ఆధ్వర్యంలో ఎస్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ సౌజన్యంతో ఈ నెల 11న జిల్లా కేంద్రంలోని ఏవీఎం పాఠశాలలో ఉచిత కరాటే శిక్షణను ప్రారంభిస్తున్నామని అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని అక్షర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఉచిత కరాటే శిక్షణ బాలబాలికలకు, మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కరాటేతో తనను తాను రక్షించుకోవచ్చని, ప్రతి వ్యక్తిలో చురుకుదనం, జిజ్ఞాస, జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందన్నారు. శారీరక, మానసిక ఎదుగుదల ఉంటుందని చెప్పారు. వేధింపులు, ఆన్‌లైన్ మోసాలపై షీటీం వారు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ శిక్షణ ప్రతి ఆదివారం ఉదయం 8గంటల నుంచి 9.30గంటల వరకు ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు 9573263625 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పు నాగయ్య, సొల్లేటి ఉపేంద్రాచారి, బత్తుల ఉపేందర్, కాళిదాసు, శంకర్‌రెడ్డి, నజీర్‌పాషా, కరాటే మాస్టర్స్ క్రాంతికుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

1,427 దరఖాస్తులు

నూతనకల్ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు కోసం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 1,427మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలి పారు. ఓటరు జాబితాను ఈ నెల 24న తహసీల్దార్ కార్యాలయంలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఏమైన అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలపాలని సూచించారు. తుది జాబితా ఏప్రిల్ 4న ప్రకటించబడుతుందని తెలిపారు.

గృహజ్యోతి పథకానికి వివరాలు ఇవ్వాలి

అర్వపల్లి : గృహజ్యోతి అమలులో భాగంగా వినియోగదారులు ఆధార్‌కార్డు, ఆహార భద్రత కార్డు, (రేషన్‌కార్డు) తమ సెల్‌నంబర్ల వివరాలను విద్యుత్ సిబ్బందికి అందించి విద్యుత్ సర్వీస్ నంబర్‌కు అనుసంధానం చేసుకోవాలని మండల విద్యుత్‌శాఖ ఏఈ వాస శ్రీకాంత్ కోరారు. గురువారం అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం తదితర గ్రామాల్లో గృహజ్యోతి ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. తమ ఇళ్లకు వచ్చే మీటర్ రీడింగ్ సిబ్బందికి వివరాలను అందించి అర్హులైన వారు గృహలక్ష్మి పథకాన్ని పొందాలని సూచించారు. అలాగే అద్దె ఉంటున్న వారు కూడా వారి వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది

తిరుమలగిరి : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని తిరుమలగిరి ఎస్‌ఐ సత్యనారాయణ కోరారు. గురువారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు, రోడ్డు భద్రతా నియమావళిపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనదారులు డాక్యుమెంట్లు, లైసెన్సులు కలిగి ఉండాలని సూచించారు. తాగి వాహనాలు నడపొద్దని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణానికి విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మించనున్న శ్రీసీతారామ కల్యాణ మండపానికి మండల కేంద్రానికి చెందిన వందనపు మోహన్‌రావు కళ దంపతులు రూ.50,116ల విరాళాన్ని గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అదే విధంగా మండల కేంద్రానికి చెందిన పెండెం శ్రీనివాస్ జ్ఞాపకార్థంగా 50సిమెంట్ బస్తాలను అందజేయనున్నట్లు అతడి భార్య శ్రీకళ, వరంగల్‌కు చెందిన లక్ష్మణరావు, అనురాధ దంపతులు 100సిమెంట్ బస్తాలు అందజేస్తామని ప్రకటించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.